ప్రజాశక్తి

మంగళవారం 26 సెప్టెంబర్ 2023

అర్జీలకు మెరుగైన పరిష్కారం : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : జగనన్నకు చెబుదాం స్పందన గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చే అర్జీలకు మెరుగైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డిఆర్‌ఒ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, డిఎల్‌డివో శివారెడ్డి, డిఆర్డిఎ పీడీ నర్సయ్య, డిపిఒ విజయ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశిత సమయంలోగా అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. పునరావృతం అయిన అర్జీకు సంబంధించి అర్జీదారున్ని వ్యక్తిగతంగా కలిసి నివేదిక ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణ పనులను అక్టోబర్ 30 నాటికి పూర్తి చేసి, సంబందితా శాఖలకు అందజేయాలని ఎంపిడిఒలు, పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్లను ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డిఎంహెచ్ఒ డా.కష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మార్కులెన్నో..?

◆ నేతల ప్రోగ్రెస్ రిపోర్టు ◆ ఎమ్మెల్యేలతో నేడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎవరికెన్ని మార్కెలొచ్చాయోనన్న గుబులు జిల్లా నేతల్లో నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నేడు ఎమ్మెల్యేలతో సమీక్షా సమావేశాన్ని అమరావతిలో ఏర్పాటు చేశారు. ఇక్కడ నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం. ఇప్పటికే నేతలు తరలివెళ్లారు. ఈ సమావేశంలో ప్రొగ్రెస్ రిపోర్టులపైనా చర్చ జరగనున్నట్టు తెలుస్తోంది. అయితే ఎవరికెన్ని మార్కులొచ్చాయన్నది గుబులు నేతల్లో నెలకొంది. కొంత మంది ఎమ్మెల్యేల పనితీరుపై తీవ్రమైన అసంతృప్తులున్నట్టు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలు సైతం ఉన్నాయి. ఈ సమాచారం నిఘా వర్గాలు, సర్వే బృందాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వద్ద ఉన్నట్టు సమాచారం. ఎక్కువ ఆరోపణలున్న వారిని ఇది వరకే ఆయన కొన్ని హెచ్చరికలు చేసినట్టు తెలుస్తోంది. అయినా నేతల్లో మార్పు లేదన్న ఆరోపణలున్నాయి. తమకు మరోమారు అవకాశం వస్తుందో రాదోనన్న ఉద్దేశంతో ఉన్నంతలో చక్కబెట్టుకునే పనిలో ఉన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు కార్యక్రమాన్ని సైతం కొంత మంది నాయకులు మొక్కుబడిగానే ముగించారు. ఇప్పటికీ ఇంకా పూర్తి చేయని వారున్నారు. వీటన్నింటి ఆధారంగానే నేతల పనితీరుపై ప్రొగ్రెగ్ రిపోర్టులు తయారీ చేసినట్టు తెలుస్తోంది. వీటి గురించి నేడు జరిగే సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించే అవకాశామున్నట్టు పార్టీ వర్గాల్లోనూ చర్చ నడుస్తోంది. ప్రొగ్రెసు రిపోర్టు సరిగా లేని వారిపై రాబోయే రోజుల్లో వేటు పడే అవకాశాలున్నట్టు కూడా తెలుస్తోంది. ఇప్పటికే కొంత మందికి వచ్చే ఎన్నికల్లో అవకాశం లేదన్న సంకేతాలను పార్టీ అధిష్టానం నుంచి ఇచ్చియున్నారు. ఈ సమావేశంలో దీనిపై మరింత స్పష్టతనిచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో వైసిపి బలీయంగానే ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 14 అసెంబ్లి నియోజకవర్గాలకుగానూ 12 వాటిల్లో గెలుపొందింది. ఉరవకొండ, హిందూపురం మాత్రమే ఓటమి చెందింది. రెండు పార్లమెంటు స్థానాల్లోనూ వైసిపినే విజయం సాధించింది. ఇవే ఫలితాలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ రాబట్టేందుకు ఆ పార్టీ పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. అనంతపురం జిల్లాలోనూ అత్యధిక స్థానాల్లో ఇప్పుడున్న నేతలను మారుస్తారన్న ప్రచారమూ సాగుతోంది. కొన్ని చోట్ల ఇప్పటికే కొత్తవారు తెరపైకి వస్తున్నారు. ఇక ఎన్నికల సమయానికి ఎటువంటి మార్పులు జరుగనున్నాయన్నది ఆ పార్టీల చర్చ నడుస్తోంది. తమకు తప్పకుండా సీటు ఉంటుందన్న ధీమాను ఏ ఒక్క నేతా వ్యక్తం చేసే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎటువంటి మార్పులు తీసుకొస్తారోనన్ని గుబులు చెందుతున్నారు. నేడు జరిగే సమీక్ష సమావేశంలో వచ్చే ప్రొగ్రెస్ రిపోర్టుతో మరింత స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీన్ని బట్టి తమ భవిష్యత్ రాబోయే రోజుల్లో ఏ రకంగా ఉండబోతోందన్న అంచనాకు నేతలు వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా ముఖ్యమంత్రి చేపట్టిన సమీక్ష సమావేశం జిల్లా నేతల్లో గుబులు రేపుతుండటం గమనార్హం.

హిందూపురంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సోమందేపల్లిలో రాస్తారోకో చేస్తున్న సిఐటియు, అంగన్‌వాడీ నాయకులు

అంగన్‌వాడీల పోరుబాట

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు జిల్లా వ్యాప్తంగా పోరుబాట పట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సోమవారం నాడు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం నుంచే సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ అంగన్‌వాడీలు జిల్లాలో నిరసనలు చేపట్టారు. సిఐటియు ఆధ్వర్యంలో కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సోమందేపల్లి జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. కదిరి, హిందూపురం, పెనుకొండ, సోమందేపల్లి, మడకశిర, గుడిబండ తదితర ప్రాంతాల్లో నిరసన తెలిపారు. అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

వార్త 6లో

వినాయక నిమజ్జనంలో ఉద్రిక్తత

కొరవడిన సమన్వయం

'పురం'లో పోలీసుల లాఠీఛార్జి

ప్రజాశక్తి-హిందూపురం

గత సంవత్సరం నుంచి హిందూపురంలో వినాయక నిమజ్జనం సమయంలో వివాదం తప్పడం లేదు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వహకుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. తాము చివరిలో నిమజ్జనం చేస్తామంటే తాము చేస్తామంటు తీవ్ర పోటీ నెలకొంది. దీంతో ఆదివారం రాత్రి జరగాల్సిన నిమజ్జన ప్రక్రియ సోమవారం రాత్రి అయినప్పటికి జరగలేదు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రెండు సంవత్సరాల నుంచి వినాయక నిమజ్జన ఉత్సవం హిందూపురంలో చర్చనీయాంశంగా మారింది. అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. మండప నిర్వాహకులతో పోలీసు శాఖ అధికారులు చర్చలు జరపడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. దీంతో పట్టణంలో ఐదు విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నిర్వహకుల నడుమ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి యువకుల మధ్య తీవ్ర వివాదం రావాడంతో పోలీసులు లాఠీ చార్జ్ చేసి యువకులను చెదరగొట్టారు. గతంలో జరిగిన వినాయక నిమజ్జన ఉత్సవాల తరహాలోనే భారీ విగ్రహాల నిమజ్జనం జరగాల్సి ఉండగా ఐదు విగ్రహాల నిర్వాహకులు పోటా పోటీగా వ్యవహరించారు. సోమవారం ఉదయం ముక్కడిపేట, కట్టకింద, బాపూజీ నగర్, అంబేద్కర్ నగర్, రైల్వే రోడ్డులో ఉన్నా గరిడి వినాయక విగ్రహాలను మున్సిపల్ కార్యలయం ముందు నిలబెట్టారు. పట్టణంలో ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనన్న ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. డిఎస్‌పి కంజాక్షన్, సిఐలు వినాయక ఉత్సవ కమిటీ నిర్వహకులకు ఎంత నచ్చజెప్పినప్పటికి తామంటే..తామే చివరిలో వేస్తామని మొండికేశారు. శాంతి సంఘ సమావేశంలో చర్చించిన విధంగా నిమజ్జనం చేయాలని డిఎస్‌పి సూచించారు. అయినప్పటికి వారు వినలేదు. దీంతో ఎప్పుడైన నిమజ్జనం చేసుకోండి అంటూ పోలీసులు చేతులెత్తేశారు. ఎవరికి వారు ఉత్సవ కమిటీ నిర్వాహకులు చర్చలు జరుపుకున్నారు. అయినప్పటికి చర్చలు ఫలించలేదు. దాదాపు నాలుగు గంటల పాటు చర్చలు జరిపారు. చివరకు మిగిలిన ఐదు విగ్రహాల్లో ముక్కడిపేటలో యువసేన గణపతిని అనంతరం బాపూజి నగర్, అంబేద్కర్ నగర్‌లోని విగ్రహాలను ఒకే సారి, కట్టకింద వైటిపి, చివరకు గరిడి వినాయకున్ని నిమజ్జనం చేయాలని వన్ టౌన్ సిఐ శ్రీనివాసులు ముందు తీర్మానం చేసుకున్నారు. దీంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. బయటకు వచ్చి ఈ విషయం యువకులకు చెప్పారు. వారు ఒక్క సారిగా లేదు తామే చివరిలో వేస్తామంటు వివాదం లేపారు. అందరు ఎవరికి వారు సర్ది చెప్పుకుని సోమవారం రాత్రి వరకు కొనసాగింది. చిన్నచిన్న వివాదాలతో ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మున్సిపల్ కార్యలయం ముందు ఉత్సవ విగ్రహాలను నిలపిన నిర్వహకులు

ఇబ్బందులు పడ్డ ప్రజలు

వినాయక నిమజ్జనంతో విద్యుత్ శాఖ వారు ఎక్కడిక్కడ విద్యుత్ నిలిపివేశారు. సంవత్సరంలో ఒక్క రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అనుకున్న ప్రజలకు ఈ సారి రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

భూస్వాధీన పోరాటంలో పేదలతో మాట్లాడుతున్న ఇఎస్.వెంకటేష్

మాట తప్పారు... మళ్లీ పోరాటమే..!

సర్వేనెంబర్ 805లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

చిలమత్తూరులో మళ్లీ భూస్వాధీన పోరాటం

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండల కేంద్రంలో పేదలకు ఈ నెల 21వ తేదీన ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు మాట తప్పారు. దీంతో పేదలు సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో మళ్లీ పోరుబాట పట్టారు. సర్వే నెంబర్ 805లో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ పేదలు సిపిఎం ఆధ్వర్యంలో పది రోజుల క్రితం భూస్వాధీన పోరాటం నిర్వహించారు. ఈ సమయంలో వారి వద్దకొచ్చి 21వ తేదీన అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని తహశీల్దార్ నాగరాజు హామీ ఇచ్చారు. 21వ తేదీ దాటినా దీని గురించి పట్టించుకోకపోవడంతో సోమవారం నాడు మళ్లీ అదే భూమిలో పేదలు భూస్వాధీన పోరాటం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్.వెంకటేష్, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కోడూరు పొలం సర్వే నెంబర్ 805లోనే పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం మళ్లీ భూస్వాధీన పోరాటం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు ఈ ఆందోళన ఉధతం చేస్తామన్నారు. మూడేళ్లుగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు అధికారులకు చేతులు రాకపోవడం దుర్మార్గం అన్నారు. లబ్ధిదారులుగా గుర్తించిన వారందరికీ ఆమోదయోగ్యమైన స్థలంలో పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు సాయం

ప్రజాశక్తి-గుడిబండ

మండల పరిధిలోని దాసరపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి మనోహర్ స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. మనోహర్ మెదడు సంబంధిత వ్యాధితో బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో నెల రోజులుగా ఐసియూలో చికిత్స పొందుతున్నాడు. ఇంకా మూడు, నాలుగు నెలలు ఐసియూలోనే చికిత్స అందించాలని డాక్టర్లు స్పష్టం చేశారు. దీంతో నిరుపేదలైన బాలుడి తల్లిదండ్రులు ఆపన్న హస్తం కోసం ఎదురుచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల, సచివాలయ సిబ్బంది తమ వంతుగా విరాళాలు సేకరించి రూ. 1,21,470లను పాఠశాల కరస్పాండెంట్ రాజుకు అందజేశారు. ఆ మొత్తాన్ని రాజు బెంగళూరు వెళ్లి మనోహర్ తల్లిదండ్రులకు అందజేసినట్లు తెలిపారు.

మనోహర్ వైద్య ఖర్చులకు విరాళాలు అందిస్తున్న పాఠశాల సిబ్బంది

దళితులపై దాడి హేయం

నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని చాకర్లపల్లి గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా దళితులపై అదే గ్రామానికి చెందిన పెత్తందారులు కులం పేరుతో దూషించి దాడి చేయడం హేయమైన చర్యని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. దాడి చేసిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చాకర్లపల్లి గ్రామంలో దళితులను పరామర్శించి, దాడి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల క్రితం చాకర్లపల్లి గ్రామంలోని సుజాతమ్మ, రామాంజినమ్మ ఇళ్లలోకి దౌర్జన్యంగా ప్రవేశించి పెత్తందారులు దాడి చేశారన్నారు. దాడి విషయాన్ని బాధితులు పోలీసులకు తెలిపినా ఇంత వరకు నిందితులను అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దళితులకు నిత్యావసర సరుకులు ఇవ్వకుండా, కూలి పనులకు పిలవకుండా సాంఘిక బహిష్కరణ చేయాలన్న ఉద్దేశంతో పెత్తందారులు ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. పోలీసులు, ఇతర శాఖల అధికారులు దీనిపై వెంటనే స్పందించాలన్నారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా తక్షణం నిందితులను అరెస్టు చేసి, దళితులకు రక్షణగా నిలవాలని కోరారు. లేకుంటే కలిసొచ్చే దళిత, ప్రజాసంఘాలతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. చాకర్లపల్లి దళితుల ఘటనపై ఈనెల 27న చర్చావేదిక నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, మండల కార్యదర్శి వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, రంగప్ప, కొండా వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బెస్త కిష్టప్ప, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు కుమ్మరి కిష్టప్ప, సిపిఎం మండల నాయకులు శ్రీకాంత్, కెవిపిఎస్ మండల నాయకులు గోవిందప్ప, కేతగాని చెరువు రామంజి పాల్గొన్నారు.

చాకర్లపల్లిలో దళితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

నాడు-నేడు రెండవ దశ పనులు పూర్తి చేయండి

అధికారులకు డిఇఒ మీనాక్షి ఆదేశం

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

మండల పరిధిలోని పలు పాఠశాలలకు రెండవ దశలో మంజూరైన మనబడి నాడు-నేడు పనులను సోమవారం డిఇఒ మీనాక్షి పరిశీలించారు. మండల పరిధిలోని పాలసముద్రం, మందలపల్లి, గోరంట్ల పట్టణంలోని జడ్పి బాలుర పాఠశాల, కెజిబివిల్లో జరుగుతున్న పనులను డిఇఒ ఎంఇఒ-2 గోపాల్‌తో కలిసి పరిశీలించారు. డిఇఒ మాట్లాడుతూ హెచ్ఎంలు, ఇంజినీరింగ్ సిబ్బంది, ఎంఇఒలు సమన్వయంతో పని చేసి త్వరితగతిన నాడు-నేడు రెండవ దశ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంఇఒలు జాన్ రెడ్డప్ప, గోపాల్, ఫీల్డ్ ఇంజినీర్లు, డిఇఇ లక్ష్మీనారాయణ, హెచ్ఎంలు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలిస్తున్న డిఇఒ మీనాక్షి

జాతీయస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని ఆర్.మరువపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటారు. విద్యార్థులు కమల్‌సాయి, హితేష్ ఆదివారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన 21వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సినీనటుడు సుమన్ నుంచి అందుకున్నారు. మడకశిరలోని శ్రద్ధ ఇంటలెక్చువల్ పాఠశాలలో హితేష్ 8వ తరగతి, కమల్‌సాయి 6వ తరగతి చదువుతున్నారు. వీరి ఎంపిక పట్ల ప్రిన్సిపల్ కార్తీక్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన కమల్‌సాయి, హితేష్

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : రొళ్ల మండల పరిధిలోని కాల్వేపల్లి గ్రామంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం నిర్మాణానికి సోమవారం అదే గ్రామానికి చెందిన మీనాక్షి, పాండురంగప్ప దంపతులు రూ. 10వేలు విరాళం అందజేశారు. దాతలు ముందుకు రావడంతో కళ్యాణ మండపం నిర్మాణం శరవేగంగా జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహ కులు రాజన్న, శ్రీరంగప్ప, కాంతరాజు, సిద్ధేష్, రంగనాథప్ప, రత్నమ్మ తెలిపారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

చట్టాలపై అవగాహన

రొద్దం : మండల పరిధిలోని సుబ్బారాయప్పగారి కొట్టాల గ్రామంలో సోమవారం అనంతశక్తి సిఇఒ లావణ్య అధ్యక్షతన టింబక్టివ్ కలెక్టివ్ ఆధ్వర్యంలో మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో మహాశక్తి నుంచి రమేజా, స్వశక్తి ప్రోగ్రాం అసోసియేట్ గౌరీ, మేనేజర్ సుకన్య పాల్గొని అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, గృహ హింసపై అనంత శక్తి సొసైటీ సిబ్బంది నాటిక రూపంలో మహిళలకు ప్రదర్శన ద్వారా వివరించారు. మహాశక్తి గురించి సొసైటీ డైరెక్టర్ క్రిష్టమ్మ మహిళలకు తెలిపారు. సదస్సులో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రామలక్ష్మమ్మ, న్యాయ సలహా కేంద్ర కమిటీ సభ్యులు, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల కన్వీనర్‌గా త్రిలోక్‌నాథ్

అమరాపురం : స్థానిక వైసిపి సీనియర్ నాయకులు త్రిలోక్‌నాథ్‌ను మండల కన్వీనర్‌గా నియమిస్తూ సోమవారం పార్టీ ఉత్తర్వులు మంజూరు చేసింది. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామికి త్రిలోక్‌నాథ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, డీలర్ సంఘం అధ్యక్షుడు శివకుమార్, పులికుంట మంజునాథ్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కనకదాసు విగ్రహావిష్కరణకు కర్నాటక మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి-మడకశిర

కర్నాటక రాష్ట్రానికి చెందిన నగరాభివృద్ధి శాఖ మంత్రి బైరాగి సురేష్‌ను సోమవారం కురుబ సంఘం నాయకులు ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మడకశిర పట్టణంలోని మధుగిరి రోడ్డు సర్కిల్ లో ఏర్పాటు చేసిన కనకదాసు విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించాలని కోరగా ఆయన హర్షం వ్యకం చేస్తూ తప్పకుండా వస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో కోట్ల రంగనాథ్, బీమరాయనపల్లి లోకేష్, భక్తరపల్లి పురుషోత్తం, నవీన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి-మడకశిర

మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన పూల నరసింహులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా సోమవారం వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట వైసిపి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, పంచాయతీరాజ్ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, బిసి జిల్లా కార్యదర్శి బేకరీ నాగరాజు, తిప్పన్న, హనుమప్ప, తిప్పేస్వామి, నరసింహప్ప, తదితరులు ఉన్నారు.

పెట్రోల్ బాటిల్‌తో రైతు నిరసన

ప్రజాశక్తి-మడకశిర

తన పొలాన్ని ఇతరులకు కేటాయించారని పేర్కొంటూ సోమవారం రైతు మల్లారెడ్డి పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు పెట్రోల్ బాటిల్‌తో నిరసన తెలిపారు. రైతు మాట్లాడుతూ వైబి హళ్లి పంచాయ తీ జాడ్రహళ్లి గ్రామం సర్వే నంబర్-7/1లో తనకు 4.3 ఎకరాల భూమి ఉందని, ఇప్పటికీ తానే సాగు చేస్తున్నా నన్నారు. రెండు రోజుల క్రితం విఆర్ఒ నోటీసు ఇచ్చి తనకు భూమి లేదని తెలిపారన్నారు. తనకు జరిగిన అన్యా యంపై పెట్రోల్ పోసుకొని తహశీల్దార్ కార్యాలయం ముందే నిప్పంటించుకుంటానని స్పష్టం చేశారు. స్పందించి న తహశీల్దార్ రికార్డులను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని సర్ది చెప్పడంతో రైతు ఆందోళన విరమించాడు.

పెట్రోల్ బాటిల్ పెట్టుకొని నిరసన తెలియజేస్తున్న రైతు మల్లారెడ్డి

పాఠశాల అభివృద్ధికి రూ. లక్ష విరాళం

మడకశిర : గుడిబండ మండల పరిధిలోని మందలపల్లి ఉన్నత పాఠశాల అభివృద్ధికి బెంగళూరులో నివాసం ఉంటు న్న జయరామరెడ్డి సోమవారం రూ. లక్ష విరాళం అందజేశారు. మందలపల్లి ఉన్నత పాఠశాలలో ఆర్‌డిటి సహకా రంతో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. దాతల సహకారం కోసం ఉపాధ్యాయులు పెద్ద చోళగిరి గ్రామా నికి చెందిన జయరామరెడ్డిని సంప్రదించగా రూ. లక్ష ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యా యులు టి.ఆదినారాయణ, పాండురంగప్ప, సన్న హనుమప్ప, హరి, వెంకటస్వామి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ. లక్ష విరాళం అందజేస్తున్న దాత జయరామరెడ్డి

ప్రజాశక్తి www.prajasakti.com

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ధర్మవరం టౌన్ : పౌర్ణమి సందర్భంగా ధర్మవరం డిపో నుండి అరుణాచలానికి ఈనెల 29న ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఆర్టీసీ డిఎం మోతిలాల్‌నాయక్, టిఐ రామాంజినేయులు తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అరుణాచలం గిరి ప్రదర్శన, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, కంచి దర్శన నిమిత్తం బస్సులను ఏర్పాటుచేశామన్నారు 28న ఉదయం 5 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామని, ఇందులో రాను,పోనూ ఛార్జీ రూ.1600 నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ సెంటర్లో కానీ టికెట్ రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7382860947 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి నుండి అరుణాచలానికి పూర్ణిమ సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పుట్టపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 28వ తేదీ ఉదయం 10 గంటలకు పుట్టపర్తి నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి కాణిపాక వరసిద్ధి వినాయక దర్శనం, అరుణాచలేశ్వర గిరి ప్రదర్శన, వేలూరు గోల్డెన్ టెంపుల్ వెళ్లి రావడానికి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్ లో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. ప్రతి నెల పౌర్ణమికి ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆలయం ప్రారంభం

ఓబుల దేవర చెరువు : మండలంలోని రాజుపాళ్యం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామ ఆలయాన్నిసోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ ఫర్వీన్ బాను, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ భాషా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వైసిపి నాయకులు బోర్ వెల్ జనార్దన్ రెడ్డి,కొల్లాయి రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు నాయకులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా నాయకులు తుమ్మల బాబా, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న ఉచిత వైద్యశిబిరం

ధర్మవరంటౌన్ : పట్టణంలోని సాయినగర్ లో గల స్పందన హాస్పిటల్ లో అక్టోబర్ ఒకటో తేదీన ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు స్పందన హాస్పిటల్ అధినేత డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. గుండెపట్ల అన్ని వయస్సులవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వైద్యుల సలహాలు పొంది, మంచి ఆరోగ్యాన్ని పొందాలని తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచితంగా ఈసీజీ, బీపీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

జగనన్న సురక్ష పై సమీక్ష

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని జగరాజుపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష ,కార్యక్రమం పై సమావేశాన్ని జిల్లా అధికారుల సమక్షంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి రమణారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జగరాజు పల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్నామని చెప్పారు. మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పై సమావేశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డిప్యూటీ డిప్యూటీ జిల్లా వైద్యాధికారి, డిఐఒ క్రిష్ణనాయక్, స్పెషలాఫీసర్ సుబ్బదాస్, ఇఒఆర్‌డి అశోక్ కుమార్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ నాగరాజు నాయక్, గ్రామ సచివాలయ ఉద్యోగులు మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం తగదు

బత్తలపల్లి : స్పందనలో ప్రజల నుంచి అందే అర్జీల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని తహశీల్దార్ యుగేశ్వరిదేవి ఆదేశించారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సౌజన్యకుమారి. ఏపీవో ఆదెప్ప, ఏపీఎం సుదర్శనరాజు, ఇతర అధికారులు హాజరయ్యారు.

కరాటేలో కొత్తచెరువు విద్యార్థిని ప్రతిభ

కొత్తచెరువు : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులో జరిగిన కటాస్ ఈవెంట్ కరాటే పోటీల్లో కొత్తచెరువు శాంతినికేతన్ స్కూల్ విద్యార్థిని సాయి సంజన మొదటి బహుమతి సాధించింది మొదటి బహుమతి సాధించిన సాయి సంజనాను సినీ హీరో సుమన్ గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. శాంతినికేతన్ స్కూల్లో సంజన ఎనిమిదో తరగతి చదువుతుంది ఈ అవార్డు సంజనాకు రావడం పట్ల శాంతినికేతన్ ప్రిన్సిపల్ ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.కరాటే మాస్టర్ రామచంద్ర ను అభినందించారు.

న్యాయవాదులకు ఘన సన్మానం

కదిరి టౌన్ : వైసిపి లీగల్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జి లింగాల లోకేశ్వర్ రెడ్డిని జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు ప్రసాద్ రెడ్డిని వైసిపి మైనార్టీ నాయకులు కె.సాదత్ అలీ ఖాన్ అధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ చైర్‌పర్సన్ జాకియా ఖానం, వైసీపీ సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి డీకే బాబు, కౌన్సిలర్ ఖాసీం , తలుపుల కన్వీనర్ డాక్టర్ ఫయాజ్, వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

29న గరుడోత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఈనెల 29న పౌర్ణమి గరుడ సేవను నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ కుండా చౌడయ్య, ఆలయ ఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగానే ధర్మవరం పట్టణంలో కూడా గత కొన్ని నెలలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. గరుడ సేవ దాతలుగా బండ్లపల్లి రఘునందన్ కుమారులు రంగనాథ్ శ్రీనివాసులు వంశీకష్ణ(సిద్ధి వినాయక స్టీల్స్) వ్యవహరిస్తారని తెలిపారు.

బకాయి వేతనాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్వచ్ఛభారత్ కార్మికులకు 15 నెలలు బకాయి వేతనాలు మంజూరు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఆసంఘం మండల అధ్యక్షులు కుల్లాయప్ప, మండల కార్యదర్శి శ్రీరాములు స్వచ్ఛభారత్ కార్మికులతో కలిసి సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో స్వచ్ఛభారత్ కార్మికులు, పంచాయతీ కార్మికులు తహశీల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్ష చేపడితే 15 రోజుల్లో కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని ఇఒఆర్‌డి రాజశేఖర్, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చి నిరసన విరమింప చేశారని తెలిపారు. అయితే ఇంతవరకు కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. తక్షణమే స్వచ్ఛభారత్ కార్మికులకు పంచాయతీ వర్కర్లకు పెండింగ్‌లో వేతనాలు చెల్లించాలని లేకపోతే శుక్రవారం నుండి రిలే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో వరలక్ష్మికి అందజేశారు . ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ కార్మికులు రమణప్ప, బాబు, నారాయణ, లక్ష్మీనారాయణ, సాలెమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్వాహకులపై చర్యలకు డిమాండ్

హిందూపురం : సకాలంలో డబ్బులు చెల్లించలేదని వైద్య సేవలను అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తేజా అసుపత్రి యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. సోమవారం అసుపత్రి ఎదుట బాధితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సల్మాన్ ఖాన్ మాట్లాడుతు తన భార్య ఫైయిజా కౌశర్‌ను మొదటి కాన్పు కోసం పట్టణంలోని తేజా అసుపత్రికి గురువారం తీసుకువచ్చానన్నారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అడ్మిట్ చేసుకున్నారు. ఆ సమయంలో బెడ్ చార్జ్ రూ.2వేలు చెల్లించాలని తెలపడంతో వెంటనే చెల్లించానన్నారు. వైద్య సేవలను అందిస్తున్న వైద్యులు సాధారణ కాన్పు చేస్తామని శనివారం ఉదయం నుంచి చెప్పారు. చివరకు శనివారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో సిజేరీయన్ చేయాలని దానికి రూ.25వేలు చెల్లించాలని చెప్పారు. ప్రస్తుతం రూ.10వేలు ఉన్నాయని, వర్షం వస్తుందని,ఉదయం చెల్లిస్తామని చెప్పానని అన్నారు. అయితే మొత్తం చెల్లించే వరకు ఆపరేషన్ చేయమని నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. చివరకు ఉదయం చెల్లిస్తామనడంతో ఆపరేషన్ చేశారన్నారు ఫైయిజా కౌశర్ మగ బిడ్డకు జన్మనిచ్చిందన్నారు. వెంటనే వైద్యులు సూచనల మేరకు పట్టణంలో చిన్న పిల్లల అసుపత్రికి బిడ్డను తీసుకెళ్లామన్నారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారని అన్నారు.తమ బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అసుపత్రిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఒపిఎస్‌ను అమలు చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిపిఎస్ సిపిఎస్ ను రద్దుచేసి ఒపిఎస్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ పుట్టపర్తిలో ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద నుండి గణేష్ కూడలి వరకు ఉపాధ్యాయులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గణేష్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జగన్ ప్రభుత్వం హామీలతో కాలం గడుపుతోందని విమర్శించారు.ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గంట పాటు నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతసేపు ఉపాధ్యాయులు పోలీసులు మధ్య తోపులాట జరిగింది. ఉద్యమాలను ఆపాలనుకోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని ఫ్యాప్టో కో చైర్మన్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మారుతీ శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ కన్వీనర్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి , నరేష్ గంగాధర్, ఆది, పెద్ది రాజు, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని నల్లరాళ్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలను అధికారులు సోమవారం పరిశీలించారు. 'నీటికుంటలా పాఠశాల ప్రాంగణం' అనే శీర్షికన సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాంకుమార్ స్పందించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత కోడూరు కార్యదర్శి నారాయణ స్వామిని ఆదేశించారు. దీంతో కార్యదర్శి నారాయణ స్వామి సోమవారం పాఠశాలను సందర్శించారు. నీటి తొలగింపునకు వెంటనే చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పాతభవనం కూల్చివేతకు తగిన చర్యలు తీసుకోవడానికి భవనాన్ని పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని మండల ఇంజనీర్ జమల్ బాషాకు సూచించామన్నారు. సమస్యను మూడురోజుల్లో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎంఇఒ తెలిపారన్నారు.

పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఆందోళనలో ఎంఆర్‌పిఎస్ నాయకులు

వివిధ ప్రజా సంఘాలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టాయి. సోమవారం స్పందన (గ్రీవెన్స్) కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలు, ఎఆర్‌పిఎస్ నాయకులు, వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల ఆందోళనతో కలెక్టరేట్ దద్దరిల్లింది. ఉపాధ్యాయ సంఘాలు పాత పెన్షన్ విధానం అమలుపరచాలని డిమాండ్ చేస్తూ గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ కు ర్యాలీ నిర్వహించారు. అయితే పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని కలెక్టరేట్ వరకు రానివ్వకుండా అడ్డుకున్నారు. అక్కడి నుంచి ఐదుగురిని మాత్రమే పోలీసులు అనుమతించగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీతో కలెక్టరేట్ చేరుకున్నారు. పోలీసులు అడ్డగించినా కూడా వారిని చేదించుకొని ర్యాలీ ముందుకు వచ్చింది. అలాగే పలు మండలాల నుంచి వివిధ సమస్యలపై ప్రజలు కలెక్టరేట్ కు చేరుకున్నారు. కలెక్టరేట్ గేటు ముందు భారీగా పోలీసులు మోహరించి ఆందోళనకారులను అదుపు చేశారు.

గూడు కోల్పోతున్నాం.. ఆదుకోండి...

సమస్యను వివరిస్తున్న బాధితులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జాతీయ రహదారి కోసం అధికారులు తాము అప్పుచేసి నిర్మించుకున్న గృహాలను తొలగించడానికి ప్రయత్నిస్తున్నారని తమను ఆదుకోవాలని గోరంట్ల మండలం బూదిలి గ్రామానికి చెందిన దళితులు కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ మేరకు వారు సోమవారం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూదిలి గ్రామంలో రహదారి ప్రక్కన దాదాపు 50 గృహాలు నిర్మించుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టాలు మంజూరు చేసిందన్నారు. దీంతో అప్పు చేసి గృహాలను నిర్మించుకున్నామన్నారు. సెంటు స్థలం 4 లక్షల రూపాయలు చేస్తుందన్నారు. అలాంటి స్థలాన్ని బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ ఇళ్లను తీసుకోవడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. సెంటు రూ. 4.50 లక్ష పలుకుతుండగా గోరంట్ల తహశీల్దార్ కేవలం సెంటు 16 వేల రూపాయలకు మాత్రమే మదింపు చేసి ఉన్నత అధికారులకు నివేదికలు పంపారన్నారు. తాము అప్పు చేసి దాదాపు 10 లక్షల రూపాయలతో ఇల్లు నిర్మించుకున్నామన్నారు. ఇప్పుడు జాతీయ రహదారి పేరుతో అతి తక్కువ ధరతో తమ గృహాలను లాక్కుంటే తాము గూడు లేక బజారు పాలు కావాల్సివస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జిల్లా కలెక్టర్ తమ గ్రామాన్ని సందర్శించినప్పుడు 16 వేల రూపాయలకు మదింపు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఆయన తహశీల్దార్‌ను మందలించారన్నారు. తాము అప్పు చేసి నిర్మించుకున్న గృహాలను కేవలం సెంటు రూ.16 వేలకు మదింపు చేస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. వాస్తవ పరిస్థితులను గమనించి గూడు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని కోరారు. దళితులే గాక మరో 10 మంది బీసీలు ఇళ్లు కోల్పోతున్నారన్నారు. తాము న్యాయంగా పెట్టిన పెట్టుబడిని నష్టపరిహారంగా ఇప్పిస్తూ అనువైన చోట తమకు గృహాలు నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు మాజీ సర్పంచి భర్త సత్యనారాయణ, రామచంద్ర, రంగయ్య, ఆదినారాయణ, అశ్వర్థప్ప, మైనార్టీ నాయకులు రసూల్ బాషా, మెకానిక్ బాబు, మారెక్క, రమణమ్మ, శ్రీలక్ష్మి, సరోజమ్మ, ఓబులమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి యువకుడు మృతి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని మోటార్‌పల్లి గ్రామానికి చెందిన నారాయణప్ప కుమారుడు అశోక్‌కుమార్(20) సోమవారం ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అశోక్ కుమార్ మూర్ఛవ్యాధితో బాధపడుతుండగా బెంగళూరులోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. ఇతని మానసిక పరిస్థితి సరిగా లేనందున ఇంటి వద్దనే ఉండేవాడు. సోమవారం తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో గ్రామ శివారులో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతిచెందాడు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు.

భవ్యశ్రీ మృతికి కారకులను శిక్షించాలి

కదిరి అర్బన్ : చిత్తూరు జిల్లా పెనుమూరు గ్రామానికి చెందిన భవ్యశ్రీని హతమార్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు అంబేద్కర్ కూడలిలో కళ్ళకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు సంపంగి గోవర్ధన్, రజక సంఘం రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు కెఆర్. హరి ప్రసాద్, బిఎస్‌పి నాయకులు కుటాగుల్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలకు డిమాండ్

కదిరి టౌన్ : కదిరి పట్టణ సమీపాన కదిరి దేవర చెరువు కౌలేపల్లి గ్రామ పొలం సర్వే నెంబర్ 174 లో చెరువు కట్టకు సంబంధించిన ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బిఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సురేంద్ర నాథ్ బెనర్జీ మాట్లాడుతూ చెరువుకు ఆనుకొని ఉన్న చెరువు కట్ట ప్రభుత్వ భూమి దాదాపు 50 సెంట్ల స్థలం కోటి రూపాయలు పైగా విలువచేస్తుందన్నారు. ఈ భూమిని అధికార పార్టీ నాయకులు కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నా పట్టించుకునే పాపాన పోలేదన్నారు. ఈ విషయం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కదిరి అర్బన్ : కులవృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న రజకులకు దోబీఘాట్ ఏర్పాటు చేయాలని రజకసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంజనేయులు, నాగభూషణ డిమాండ్ చేశారు. రజకుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో రాఘవకు సోమవారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని విఠలరాయునిచెరువు సమీపాన 72 సెంట్లు దోబీఘాట్‌కు కేటాయించారన్నారు. అయితే వాటి నిర్మాణం కొరకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దోబీఘాట్ నిర్మించి అవసరమైన బోరు, విద్యుత్తు మోటార్ సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వందేభారత్ రైలును 'పురం'లో ఆపాలి

హిందూపురం : కేంద్ర ప్రభుత్వం సికింద్రాబాద్–బెంగళూరు మధ్యన నడిచే వందే భారత్ రైలును హిందూపురంలో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణు రెడ్డి డిఆర్‌ఎంను కోరారు. ఆదివారం రాత్రి వందే భారత్ రైలుకు హిందూపురంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగళూరు డివిజన్ డిఆర్‌ఎం, హిందూపురం ఎంపీ గోరంట్లా మాధవ్, వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణు రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

పుట్టపర్తి రూరల్ : తమ స్థలంలో తాము బండలు పాతినందుకు తమపై దాడులకు దిగుతున్నారని రొద్దం మండలం పెద్ద కోడి పల్లికి చెందిన అక్కమ్మ, పుణ్యవతి ,సుశీలమ్మ, శాంతమ్మ, ఎస్పీ ముందు కన్నీరు మున్నీరయ్యారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వారు ఎస్పీకి తమ సమస్యను విన్నవించారు. సిఐ కరుణాకర్ సమక్షంలో స్థలాన్ని కొలతలు వేసి బండలు పాతామని చెప్పారు. ఎస్పీ స్పందించి పెనుగొండ డీఎస్పీతో ఈ కేసు విషయంపై ఆరా తీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా 42 పిటీషన్లు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా రస్తావివాదాలు, కుటుంబ కలహాలు, అదనపు కట్నం కోసం భర్త/అత్తారింటి వేధింపులు, భూవివాదాలు తదితర సమస్యలతో బాధితులు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. పోలీసుల పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, దిశా డీఎస్పీ వరప్రసాద్ , లీగల్ అడ్వైజర్ సాయి నాథ్ రెడ్డి పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ముదిగుబ్బ విద్యార్థులు

ముదిగుబ్బ : యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ వారు ఈనెల 24 అనంతపురం జిల్లాకేంద్రంలో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు సంయుక్తంగా నిర్వహించిన యోగా పోటీలలో ముదిగుబ్బ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. మండల కేంద్రంలోని శాంతి ఆనంద పాఠశాల నుండి యోగా కోచ్ ప్రభావతి పర్యవేక్షణలో ఏడుగురు విద్యార్థులు పాల్గొని జిల్లా స్థాయిలో రెండవ, మూడవ స్థానాలను సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ తెలిపారు.ఈ నేపథ్యంలో సోమవారం ముదిగుబ్బ మండల విద్యాధికారి వెంకట రమణ శాంతి ఆనంద పాఠశాలను సందర్శించి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన కీర్తి నందన (అవతరగతి), అసిఫ్ (7వ తరగతి) విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శాంతి ఆనంద ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ చంద్రమోహన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్బంధించడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనం

కదిరిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మడకశిరలో ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - హిందూపురం

అంగన్ వాడీ ఉద్యోగులు ఆందోళనకు దిగితే వారిని అక్రమంగా నిర్బందించడం ప్రభుత్వ చేతగానితనాకి నిదర్శనం అని సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ అన్నారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ఎక్కడిక్కడా అంగన్ వాడీ కార్యకర్తలను నిర్బంధించడాన్ని నిరసిస్తు సిఐటియు ఆద్వర్యంలో పెద్ద ఎత్తున అంగన్ వాడి కార్యకర్తలు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్బంగా వెంటకేష్ మాట్లాడుతుతమ న్యాయమైన కోరికల కోసం ఎన్నో ఏళ్లగా డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు, వెంటనే అంగన్ వాడి కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్ వాడి కార్యకర్తలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పి నరసింహప్ప, అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు శిరీష, వరలక్ష్మి, సుమియా, పద్మక్క, భాగ్యమ్మ, శివమ్మ, రాజమ్మ, రూప, శశి, రిహానా తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు శ్రామిక మహిళా కన్వీనర్ నాయకురాలు దిల్షాద్ డిమాండ్ చేశారు సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు అంగన్వాడీ వర్కర్లతో కలిసి ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సూపర్వైజర్‌కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వాసంతి, వసంత, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : అంగన్వాడీ అరెస్టులు ప్రజాస్వామికమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దామోదర్, జిల్లా కమిటీ సభ్యులు అనిల్ కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు నిరంజన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు వారు మాట్లాడుతూ అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై శాంతియుతంగా విజయవాడలో మహధర్నా నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వకుండా, అమానుషంగా ముందస్తు అరెస్టులు, గృహ నిర్బందాలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ఈ ఘటనను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అంగన్వాడీల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఓబుల దేవర చెరువు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, అంగన్వాడి యూనియన్ లీడర్లు వరలక్ష్మి, మేరీ సుజాత, కమల ,షమీం, రత్నమ్మ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మమదాబాద్ క్రాస్ వద్ద గల ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినిత పత్రాన్ని సిడిపిఒ వరలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు స్వర్ణ, సుకన్య, చంద్రకళ, మంజుల, వెంకట నరసమ్మ, సునంద తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : తమ సమస్యలను పరిష్కరించేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని సిఐటియు మండల కార్యదర్శి అయూబ్ ఖాన్, రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జెవి. రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పుప్రకారం గ్రాట్యూటీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు సరస్వతి, చంద్రకళ, అంగన్వాడీలు గోవిందమ్మ, పోతక్క, దీన, అరుణ, రత్నమ్మ, అనిత, కృష్ణవేణి, లలిత, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని అడ్డుకున్నంత మాత్రానా ఉద్యమాలు ఆగవని సిఐటియు నాయకులు జగన్మోహన్ అన్నారు. చలో విజయవాడ వెళుతున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు కదిరి సిడిపిఒ ప్రాజెక్టు ఆఫీస్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన ఆందోళనకు ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. అయితే అంగన్వాడీ కార్యకర్తలపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తూ నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిడిపిఒ రాధికకు వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జిఎల్. నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్ అలీ తో పాటు అంగన్వాడీ యూనియన్ నాయకులు మాబున్నిసా, సుశీల, సుజాత, సువర్ణ, సరోజ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : విజయవాడ ధర్నా చౌక్ వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తలపెట్టిన మహాధర్నాను భగ్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడికక్కడ అంగన్వాడీ సిబ్బందిని నిర్బంధాలతో ఆపివేయడం హేయమైన చర్య అని సిఐటియు మండల కార్యదర్శి బాబావలి పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది న్యాయమైన డిమాండ్స్‌పై సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సత్యనారాయణకి వినతి పత్రం సమ ర్పించారు. బాబావలి మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, కనీస వేతనం రూ. 26 వేలు, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ, రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంపు, ఆఖరి వేతనంలో సగం పెన్షన్, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు, తదితర డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు మాబున్నీసా, బావమ్మ పాల్గొన్నారు.

మడకశిర : సమస్యల పరిష్కారం కోసం 'చలో విజయవాడ' కార్యక్రమం చేపట్టిన అంగన్వాడీ సిబ్బంది అరెస్టుకు నిరసనగా సోమవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బందిని పోలీసులు అడ్డుకోవడం దారుణ మన్నారు. అనంతరం సిడిపిఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు గీతా బాయి, వెంకమ్మ, సునందమ్మ, అనితమ్మ, మంజుల, నరసమ్మ, తిమ్మక్క, భాగ్యమ్మ, రంగమ్మ, గంగమ్మ ఉన్నారు.

సోమందేపల్లి : అంగన్వాడీ వర్కర్స్ నిర్బంధాన్ని నిరసిస్తూ సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ స్థానిక జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో లో సిఐటియు జిల్లా కార్యదర్శి పెడపల్లి బాబా, మండల నాయకులు రాజగోపాల్, చాంద్‌బాషా, మాబు, అంగన్వా డీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు అరుణ, నాగమణి, పద్మావతి, ప్రమీలమ్మ, అరుణ, భాగ్యమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.

గుడిబండ : విజయవాడలో తలపెట్టిన ధర్నాకు వెళు న్న మండల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, దేవీరమ్మ తెలిపారు. పోలీసుల వైఖరి పట్లఅంగన్వాడీ వర్కర్లు, ఆయాలు మండిపడ్డారు.

కనువిందు చేస్తున్న బట్రేపల్లి జలపాతం

కదిరి టౌన్ : రెండు రోజులుగా కురిసిన వర్షాలకు బట్రేపల్లి జలపాతం కనువిందు చేస్తోంది. జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేస్తున్నారు. తలుపుల మండలం కదిరి పులివెందుల ప్రధాన రహదారి బట్రేపల్లి వద్ద ఎత్తయిన కొండల మధ్య నుండి కిందకు జాలువారుతున్న నీటితో బట్రేపల్లి జలపాతం పర్యాటకులను కట్టిపడేస్తుంది.ఎగువ ప్రాంతం కొండ నుండి వర్ష నీరంతా వంద అడుగులు పైనుండి తెల్లని పాల వలే కిందికి ప్రవహిస్తున్న దృశ్యాన్ని చూసి ప్రకృతి ప్రియులు తన్మయం చెందుతున్నారు. దాదాపు 5 కి.మీ మేర పరుచుకున్న పచ్చదనంతో అటవీ ప్రాంతం కళకళలాడుతోంది. పక్షుల కిలకిల రావాలు, కుందేళ్ళు కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి. జలపాతం వద్ద పర్యాటకు లు కేరింతల కొడుతూ ఉత్సాహంగా గడుపుతున్నారు.ఉదయం సాయంకాలం నెమళ్ల నాట్యం కనువిందు కలిగిస్తోంది. ముఖ్యంగా శ్రీసత్య సాయి, అనంతపురం, కడప, అన్నమయ్య జిల్లాల సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ జిల్లాల నుండి కుటుంబ సభ్యులతో కలిసి ఈ ప్రాంతానికి వచ్చి వన భోజనాలు సైతం చేస్తుంటారు.

చిత్రావతి నది నుంచి ఉప్పర్లపల్లి చెరువుకు నీరు విడుదల

బత్తలపల్లి : మండలంలో ప్రవహిస్తున్న చిత్రావతి నది నుంచి ఉప్పర్లపల్లి చెరువుకు నీటిని విడుదల చేశారు. మండలంలోని సంఘమేశ్వర క్షేత్రం సమీపంలోని చిత్రావతి నదిపై ఆర్డీటీ సహకారంతో బ్రిడ్జి నిర్మించారు. ఇక్కడ ఉప్పర్లపల్లి చెరువుకు నీరు వెళ్లేందుకు ముందు కట్టుకాలువ ఉండేది. బ్రిడ్జి నిర్మాణంతో అక్కడ గేటు ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో చిత్రావతి నది ప్రవహిస్తోంది. దీంతో వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆర్డీటి అధికారుల చేతుల మీదుగా సోమవారం నీరు విడుదల చేయించారు. ఆర్డీటీ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, ఇంజనీర్ మురళితో పాటు బయపరెడ్డి, వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డి, లింగమయ్య. రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాదవరెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొని ఉప్పరపల్లి చెరువుకు వెళ్లే కాలువ వద్ద ఏర్పాటు చేసిన గేటును తెరిచి నీటిని విడుదల చేశారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కదిరి టౌన్ : హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో సుమన్ షోటోఖాన్ కరాటే అకాడమీ టెక్నికేల్ డైరెక్టర్,టోర్నమెంట్ ఆర్గనైజర్ బుడ్డా సైదులు ఆధ్వర్యంలో 21 వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కదిరికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి నట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. ఈ కరాటే పోటీలలో కదిరి, ఒడిసికి చెందిన ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల సుమారు 29 మంది పాల్గొనగా 17 మంది బంగారు, 8 మంది వెండి, నలుగురు కాంస్య పతకాలు సాధించారన్నారు. ఒవరాల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని బుడ్డా సైదులు మాస్టర్ షాకిర్‌కి అందజేశారు.

మాదిగలకు అన్యాయం చేస్తే గద్దె దింపుతాం

పుట్టపర్తి క్రైమ్ : ఎస్సీ వర్గీకరణపై మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తున్న వైసిపిని గద్దె దింపుతామని ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌జె. ప్రకాష్ హెచ్చరించారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు డప్పుల మోతలతో భారీ ప్రదర్శన చేశారు. ర్యాలీగా వస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నప్పటికీ వారిని లెక్కచేయకుండా తోసుకొని కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మాదిగ ఉపకులాల కోరికలను ప్రభుత్వం తక్షణమే తీర్చాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల అధ్యక్షులు చిప్పగిరి లక్ష్మీనారాయణ, మాదిగ యువసేన రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మన్న, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్ద నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి స్వామి దాస్, ఉమ్మడి అనంతపురం జిల్లాల ఉపాధ్యక్షులు సంపత్, ప్రధాన కార్యదర్శి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లిలో పాదయాత్రలో పాల్గొన్న బికె పార్థసారథి, పెనుకొండలో దీక్షలో పాల్గొన్న సవితమ్మ, గుడిబండలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టిన ఈరన్న, తెలుగుతమ్ముళ్లు

వైసిపి ఓటమి భయంతోనే

చంద్రబాబు అక్రమ అరెస్టు

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాబోయే ఎన్నికల్లో వైసిపి ఓడిపోతేందనే భయంతోనే సిఎం జగన్ చంద్రబాబుపై అక్రమ కేసులు బనా యించి జైల్లో పెట్టించారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పేర్కొన్నారు. మండల పరిధిలోని గుడిపల్లి గ్రామంలో వెలసిన సజ్జగంట రంగనాథ స్వామి దేవాలయం నుంచి స్థానిక పెద్దమ్మ గుడి వరకూ బికె ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్ల పాదయాత్ర నిర్వహించారు. బికె మాట్లాడుతూ సిఎం జగన్ పాలన మరచిపోయి ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నా రని, వైసిపికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కురుబ కృష్ణమూర్తి, మునిమడుగు వెంకటరాముడు, కడపల్లి రమణప్ప, తలారి చలపతి, ఎస్ఆర్ వేణుగోపాల్, మండల కన్వీనర్ సిద్ధి లింగప్ప, రామకృష్ణప్ప, భానుకీర్తి, సంజీవరెడ్డి, అనసూయమ్మ, సుబ్బరత్నమ్మ, నాగమణి, అశ్వర్థనారాయణ, హరికృష్ణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు దుర్మార్గం : గుండుమల

అగళి : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మండల పరిధిలోని హళ్లికెర నుంచి ఇనగలూరు, మదుడి, నరసంభూది మీదుగా అగళి వరకూ పాదయాత్ర చేపట్టారు. స్థానిక బస్టాండ్‌లో గుండుమల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రసంగించారు. చంద్రబాబు విడుదలయ్యేంత వరకూ నియోజకవర్గంలో పాదయాత్రలు, ర్యాలీలు కొనసాగుతూనే ఉంటాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశంలోనే గొప్ప నాయకుల్లో ఒకరైన చంద్రబాబును వైసిపి ప్రభుత్వం దురుద్దేశంతో అరెస్ట్ చేయించి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. సిఎం జగన్ దిగజారుడు రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పాదయాత్రలో మండల కన్వీనర్ కుమారస్వామి, జడ్పిటిసి ఉమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైకో ప్రభుత్వానికి చమరగీతం పాడుదాం : ఈరన్న

గుడిబండ : రాబోయే ఎన్నికల్లో జగన్ సైకో ప్రభుత్వానికి చమరగీతం పాడుదామని మాజీ ఎమ్మెల్యే ఈరన్న పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక హనుమాన్ థియేటర్ ఆవరణలో చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలో ఈరన్నతో పాటు తెలుగుతమ్ముళ్లు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. వీరి దీక్షకు జనసేన, సిపిఎం, సిపిఐ, తదితర పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈరన్న మాట్లాడుతూ చంద్రబాబు స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు వృత్తి విద్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తే సైకో ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిందని, ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వైసిపిని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. దీక్షలో రాష్ట్ర వక్కలిగ సాధికార సమితి కన్వీనర్ పాండురంగప్ప, సుధాకర్, ఉగ్ర నరసింహప్ప, ఆదినారాయణ, అశ్వత్తరామప్ప, జయరామరెడ్డి, ప్రకాష్, భోజరాజు, మారేగౌడ్, మహలింగప్ప, తిప్పేస్వామి, రామాంజనేయులు, కెంచప్ప, ఈశ్వరప్ప, రామ్‌గోపాల్‌రెడ్డి, గంగాధర్, మూర్తినాయక్, జయరామప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే టిడిపి రావాలి : సవితమ్మ

పెనుకొండ : రాష్ట్రం బాగుండాలంటే టిడిపి అధికారంలోకి రావాలని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్‌లో ఉన్న తన వ్యక్తిగత కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబును విడుదల చేసేంత వరకూ దీక్షలు ఆగవన్నారు. సిఎం జగన్ రాక్షస పాలన సాగిస్తున్నారని విమర్శించారు.ప్రతి జిల్లాలో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందన్నారు. వీరి దీక్షకు జనసేన, సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మద్దతుగా పోస్టుకార్డు ఉద్యమం

ధర్మవరం టౌన్ : చంద్రబాబునాయుడును వెంటనే విడుదల చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదేశాల మేరకు పోస్టుకార్డుల ఉద్యమాన్ని ఆయన అభిమానులు సోమవారం చేపట్టారు. చంద్రబా బును విడుదల చేయాలని ప్రజల నుంచి పోస్టుకార్డుల ద్వారా సంతకాలు చేయించి వాటిని రాష్ట్రపతికి పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిగిచెర్ల అరవిందరెడ్డి, సుదర్శన రెడ్డి, రాజు, తుంపర్తి పరమేశ్, రాము, నబీరసూల్, దుస్సా క్రిష్ణ, కొండాశీన, దస్తగిరి, లక్ష్మీనారాయణ, గంధమ నేని నారాయణస్వామి పాల్గొన్నారు. ఓటమి భయంతోనే వైసీపీ పెద్దలు చంద్రబాబునాడుడిపై అక్రమ కేసు బనా యించి అరెస్టు చేసి జైలుకు వెళ్లేలా చేశారని యాదవ సంఘం నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలేనిరాహారదీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం లో రాక్షస పాలన సాగుతోందన్నారు. నాలుగేళ్లగా వైసీపీ చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నా రని, వీటికి త్వంలో ప్రజలే ఓటుతో తగిన గుణపాఠం చెబు తారన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ప్రతి గడపకు వెళ్లి తెలియజేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. చంద్రబాబు అరెస్టుపై తయారుచేసిన కరపత్రాలను మండలాల వారిగా టీడీపీ నాయకులకు అందజేసి ప్రతి ఒక్కరు రానున్న ఐదు రోజుల్లో ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి వివరించాలన్నారు.

కదిరిలో రిలే దీక్షలో పాల్గొన్న కందికుంట వెంకటప్రసాద్

వైసిపికి రోజులు దగ్గర పడ్డాయి

కదిరి టౌన్ : వైసిపికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో కదిరి పట్టణం లోని మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మేము సైతం బాబు తో కార్యక్రమంలో భాగంగా అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ తనకల్లు మండల నాయకులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలకు సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ సంఘీ భావం తెలిపారు.ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీల నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడం అక్రమ కేసులతో భయ పెట్టాలని చూడడం ఆయన నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చంద్రబాబు ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని దేశంలోనే అన్ని రాజకీయ పార్టీలు కూడా ముక్త కంఠంతో ఖండిస్తున్నాయని అన్నారు. అనంతరం దీక్ష చేస్తున్న తనకల్లు మండల టీడీపీ నాయకులకు సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య ఒఆర్ఎస్ ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

అగళి ఎన్టీఆర్ సర్కిల్‌లో ప్రసంగిస్తున్న గుండుమల

పుట్టపర్తి అర్బన్ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ కోవెలగుట్టపల్లి సమీపంలోని చిత్రావతి నదిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో పాటు నాయకులు జలదీక్ష చేపట్టారు. సోమవారం చిత్రావతి నదిలో ఈ దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడం దారుణం అన్నారు. అక్రమ కేసులతో బాబు నిజాయితీని అడ్డుకోలేరన్నారు. ప్రభుత్వం బాబును విడుదల చేస్తే తప్ప తమ ఆందోళన ఆగదన్నారు. కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, బొమ్మయ్య, మైలే శంకర్, రూరల్ కన్వీనర్ విజయ్ కుమార్, ఉమాపతి, నాగేంద్ర ప్రసాద్, కౌన్సిలర్ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, నాగేంద్ర, నారాయణ, నరేష్, ఆంజనేయులు, కేశవ పాల్గొన్నారు.

ముదిగుబ్బ : చంద్రబాబును వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్‌తో మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ అభిమానులు సోమవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని పాత ఊరు, గాండ్ల వారి పల్లిలో వెయ్యి పోస్టుకార్డులు రాష్ట్రపతికి పంపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌నాథ్‌రెడ్డి, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, బాల భాస్కర్, రెడ్డప్ప, సురేష్‌రెడ్డి, రామాంజి పాల్గొన్నారు.

ధర్మవరంలో రాష్ట్రపతికి రాసిన లేఖలను పోస్టు బాక్సులో వేస్తున్న 'గోనుగుంట్ల' అభిమానులు, ముదిగుబ్బలో పోస్టుకార్డులను చూపుతున్న మద్దతుదారులు, పుట్టపర్తిలో జలదీక్ష చేపట్టిన పల్లె, టిడిపి శ్రేణులు